## క్లుప్తంగా

### వన్‌టౌన్ సీఐగా పీఎన్‌డీ ప్రసాద్



మిర్యాలగూడ అర్బన్ : వన్‌టౌన్ సీఐగా పీఎన్‌డీ ప్రసాద్ బదిలీ వచ్చాడు. ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన రాఘవేందర్ సైఫాబాద్ సీఐగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పీఎన్‌డీ ప్రసాద్‌ను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### సబ్‌జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

నాగార్జునసాగర్ : సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక పీఏపల్లిమండలంలోని మేడారంలో శనివారం ఉదయం 11గంటలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే బాల, బాలికల వయస్సు 16ఏళ్లలో 55కేజీ బరువు కలిగి ఉండాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ భూలోకరావు, జి.కర్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకొనిరావాలని సూచించారు.

**నేడు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక**

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని మేడారంలో సబ్‌జూనియర్ జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్యలు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 16ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి 55కిలోల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు.

### భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలి

మిర్యాలగూడ : యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భూములు కోల్పోయిన కొంతమంది రైతులకు ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం అందించలేదని వెంటనే అందించాలని సీపీఐ దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. స్థానికులకే ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కబ్జాలో ఉన్న రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు. దామరచర్ల మండల కేంద్రంలో శనివారం నిర్వహించే మండల జనరల్ బాడీ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని కార్యకర్తలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### బీఆర్‌ఎస్‌కు రాజీనామా

గుర్రంపోడు : బీఆర్‌ఎస్ గుర్రంపోడు మండల శాఖ అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం గుర్రంపోడులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో తన అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు సమయం కేటాయించలేని పరిస్థితుల్లో పదవికి న్యాయం చేయలేనని భావించి రాజీనామా చేస్తున్నాని తెలిపారు. అధ్యక్షుడిగా పదేళ్ల కాలం అవకాశం ఇచ్చిన జిల్లా పార్టీ బాధ్యులకు, సహకరించిన మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

### 'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తులు

నిడమనూరు : నిడమనూరు ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రంజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లకు, 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి ఈనెల 22 చివరి తేదీ అని అన్నారు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.125, ఓసీ విద్యార్థులకు రూ.175 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న ఆరో తరగతి వారికి ఏప్రిల్ 7న ఉదయం పది నుంచి 12. 30గంటల మధ్య, ఏడో నుంచి పదోతరగతి వారికి మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

### ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాయపూడి భవాని

మిర్యాలగూడ టౌన్ : వాసవి, వనిత, కుసుమాంబ క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ప్రయాణికులు, పాదాచారులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్‌ఓ రాయపూడి భవాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజినల్ చైర్మన్ పద్మావతి, జోనల్ చైర్మన్ రమాదేవి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పద్మావతి, అనిత, లావణ్య, ఇందిరా, పుష్పావతి, ఉషాబాల, శ్రీదేవి, జైనీ సుశ్మిత పాల్గొన్నారు.

# తుప్పపడుతున్న వాహనాలు

- మరమ్మతులు లేక షెడ్డులోనే చెత్త సేకరణ ఆటోలు
- చోరీకి గురవుతున్న సామగ్రి
- వాహనాల కొరతతో ఇబ్బందులు పడుతున్న కార్మికులు



ఎన్నెస్పీ క్యాంపు షెడ్డులో నిరుపయోగంగా ఉన్న మున్సిపాలిటీ వాహనాలు



బస్తాలో చెత్తను తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలు తుప్పుపట్టిపోతున్నాయి. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ వాహనాల మరమ్మతులకు రావడంతో పక్కనబెడుతున్నారు. దీంతో అవి తుప్పుపట్టిపోతున్నాయి. వాటికి కోసం కనీసం టెండర్లు కూడా పిలవడం లేదు. అయితే మరమ్మతులకు నోచుకోకుండా కొన్ని మున్సిపాలిటీల ఆవరణలో ఉండగా మరికొన్ని ఎన్నెస్పీ షెడ్డులో పడేశారు.

**చోరీకి గురవుతున్న వాహనాల సామగ్రి..**

మున్సిపాలిటీలో 48 వార్డులకు గాను 48 ఆటోలు ఉండగా వాటిలో ఐదారు పూర్తిగా చెడిపోయి మరమ్మతులకు నోచుకోకుండా నిరుపయోగంగా మారాయి. అదే విధంగా 12 ట్రాక్టర్లు ఉండగా వాటిలో కొన్ని ట్రాక్టర్లు డోర్లు సరిగా లేకపోవడంతో రెండు ట్రాక్టర్లు పూర్తి మురమ్మతులకు చేయకపోవడంతో షెడ్డులోనే నిరుపయోగంగా ఉన్నాయి. అదే విధంగా డంపర్ వాహనాన్ని లక్షలాది రూపాయలు వెచ్చించి తీసుకొచ్చి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆ వాహనం కూడా తప్పుబట్టిపోతున్నాయి. కొన్ని వాహనాలకు చెందిన టైర్లు, విలువైన సామగ్రి ఇప్పటికే చోరీకి గురయ్యాయి. అదేవిధంగా కొన్ని ఆటోలు కూడా కండిషన్‌లో లేకపోవడంతో వాటికి మరమ్మతులు చేయకుండా వాటిని వదిలి మరో కొత్త వాహనాలపై పాలక మండలి దృష్టి సారిస్తున్నారు.

**ట్రైసైకిళ్ల లేక ఇబ్బందులు..**

మున్సిపాలిటీలో గతంలో కాలువల్లో తీసిన చెత్తను డంప్ చేసేందుకు తీసుకెళ్లేందుకు 100 వరకు వీల్ భరోస్(చిన్న తోపుడు బండ్లు) ఉండేవి. కానీ అవి తూతూ మంత్రంగా ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి చెతా చెదారాన్ని ఒక బస్తా సంచుల్లో కార్మికులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లతున్నారు. ఒక వైపు వాహనాల సామగ్రి భూమిలో కలిసిపోతుండగా మరో వైపు ఆ వాహనాలకు సంబంధించిన సామగ్రి కూడా చోరీకిగ గురవుతున్నా పట్టించుకున్నా నాథుడే లేడు. 48 వార్డులు ఉండగా ఒక్కొక్క వార్డుకు రెండు, మూడు చొప్పున చెత్తా, చెదారంను ఎత్తివేసేందుకు ట్రైసైకిళ్లు ఉండాల్సి ఉండగా కేవలం 15 మాత్రమే ఉన్నాయని పలువురు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. వాహనాల సామగ్రిని వేలం పాట వేస్తే కొంత వరకు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పాత వాటిని పక్కన పెట్టి మున్సిపల్ అధికారులు కొత్త వాటిపై మొగ్గు చూపడంతో ఉన్న వాహనాలు తుప్పు పట్టి భూమిలో కలిసిపోతున్నాయి.

**కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తా**



"మున్సిపాలిటీలో వాహనాల విషయంపై సమగ్రంగా వివరాలు తీసుకొని ఏమైన మరమ్మతులు చే యాల్సి ఉంటే చేయిస్తాం. పూర్తిగా చెడిపోయిన వాహనాలను తుక్కుకు వేలం వేసేందుకు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకెళ్తా.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

## కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ఈనెల 13న నల్లగొండలో నిర్వహించే మాజీ సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త, పటాన్‌చెరువు బీఆర్‌ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వేములపల్లి, మాడుగులపల్లి, అడవిదేవులపల్లి మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల జరిగే నష్టాను ప్రజలకు వివరించడానికి, తెలంగాణ హక్కుల పరిరక్షణకు మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 15వేలకు పైగా ప్రజలు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, మండల పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఎండి.కరీం, జెర్రిపోతుల రాములుగౌడ్, నిమ్మల నవీన్‌రెడ్డి, కట్టా మల్లేష్‌గౌడ్, పేరాల కృపాకర్‌రావు, చిర్ర మల్లయ్యయాదవ్, మిర్యాల మధుసూదన్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించడం అభినందనీయం



వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

హాలియా : ప్రభుత్వ పాఠశాల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ వమించి బోధన అందించడం అభినందనీయమని హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫరంగి రవికుమార్ అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల అభినంద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతి శనివారం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాలల్లో చదువులో వెనుక బడిన విద్యార్థులపై దృష్టి సారించి బోధన చేయడం అభినందనీమన్నారు. ప్రతి శనివారం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి వెనుకబడిన విద్యార్థులకు విద్యనందిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించి వారికి పుస్తకాలు, బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ యాదయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ రాజు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు ఉన్నారు.

## వివరాల నమోదులో పొరపాట్లు ఉండొద్దు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య, హౌసింగ్ పీడీ రాజ్

త్రిపురారం : మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రజల నుంచి సేకరించి వివరాలను పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలనిమిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య, సాగర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి హౌసింగ్ పీడీరాజ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, తహసీల్దార్ గాజుల ప్రమీలతో కలిసి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆరు గ్యారంటీ పథకాలు అమలు, ప్రత్యేక అధికారుల పాలనపై శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పాలనలో గ్రామాల నుంచి ఆరు గ్యారంటీల పథకాలపై దరఖాస్తు చేసుకున్న వివరాలు తప్పొప్పులపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులు గ్రామాల్లో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ప్రజలు అందుబాటులో ఉంటు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సైదులు, ఆర్ఐ సైదులు, ఎంపీఓ బిక్షం రాజ్, త్రిపురారం పంచాయతీ కార్యదర్శి కొడిరెక్క రాజేంద్ర కుమార్, రమేష్, శ్రీనివాస్, ఉపేందర్ పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాహిల్ హైస్కూల్లో అబాకస్ వర్క్‌షాప్

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రెడ్డీకాలనీలోని డాహిల్ హైస్కూల్‌లో శుక్రవారం అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ట్రైనర్ సుధీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.సాయిశ్రీనివాస్, హెడ్ మాస్టర్ ఎం.శ్రీకాంత్‌బాబు, ఉపాధ్యాయులు భవాని, త్రివేణి, శ్రీదేవి పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న సుధీర్

## సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు



పెద్దవూరలో మాట్లాడుతున్న ఏఓ సందీప్

పెద్దవూర : మిరప పంటలో అధిక దిడుబడులు సాధించాలంటే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మిరప పంటపై నిర్వహించిన ఒకరోజు రైతు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది మండలంలో మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారని, ప్రస్తుతం మిరపలో కొమ్మ ఎండు, కాయకుళ్లు, బూడిద తెగులు, కాయతొలిచే పురుగు, ఎర్ర, నల్ల తామరతో తీవ్రత అధికంగా ఉందని దీంతో పంట నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. మిరపలో పూత దశనుంచి కాయ దశకు వచ్చే సమయాల్లో కొమ్మ ఎండు, కాయ కుళ్లు తెగుళ్లు ఆశించే అవకాశాలు ఉంటాయని, వీని నివారణకు ఎకరం పొలానికి 200 లీటర్ల నీటిలో 200 మి.లీ, ప్రొఫికొనజోల్ లేదా 100 మి.లీ. డైఫెన్ కొనజోల్ లేదా 200 గ్రాముల ఫైరాక్సీ స్ట్రోబిన్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చలి తేమ వంటి వాతావరణ మార్పులతో బూడిద గెతులు సోకుతుందని, దీని నివారణకు 200 లీటర్ల నీటిలో 300 గ్రా. గంధకం లేదా, 200 మి.లీ, డైనోకాప్ లేదా బెలటాన్ ను కలిపి ఎకరం పొలానికి పిచికారీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఈవోలు తనూజ, సితార, ఆంజనేయులు, రాము, మధుకర్, రైతులు శ్రీనివాస్, అంజి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం



దేవరకొండ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ : కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తి కావస్తున్నా బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించలేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ఆరోపించారు. శుక్రవారం దేవరకొండలోని సీపీఐ ప్రజాభవన్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అవలంబిస్తున్న మతతత్వ విధానాలనుదిక్కరిస్తూ ప్రతిఘటనకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెను రైతులు, కార్మికులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నూనె వెంకటేశ్వర్లు, వెంకట్రాములు, మైనొద్దీన్, బుచ్చయ్య, గెలువయ్య, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధికారి మోహన్‌రెడ్డికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఏశోభు, దానయ్య, శివశంకరాచారి, సంజీవ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హాలియా : రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు హాలియా పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్ సునీల్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా వారు మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 30న నల్లగొండలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్ సునీల్ పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 10, 11, 12వ తేదీల్లో వరంగల్ జిల్లాలోని హన్మకొండలో జరగబోయే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సునీల్‌ను పాఠశాల డైరెక్టర్ ఉన్నం శ్రీను బాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## కరెంట్ బిల్లును తెలుగులో ముద్రించాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : కరెంట్ మీటర్ బిల్లును తెలుగులో ముద్రించాలని కోరుతూ తెలంగాణ యువజన సేవా సంఘం అధ్యక్షుడు సుంకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డీఈ కార్యాలయ అధికారి ఏఈ నిఖితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుంకు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగులో బిల్లు ఇచ్చినట్లెతై వినియోగదారులు కరెంట్ వాడకం దేనికి ఎంత అవుతుందనే విషయాలను తెలుసుకుంటాడనన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో చేగొండి మురళీయాదవ్, బాషిత్, లతీఫ్, జయరాజు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## తూం ఏర్పాటును పరిశీలించిన ఈఈ శ్రీధర్‌రావు



అధికారులతో మాట్లాడుతున్న ఈఈ శ్రీధర్‌రావు

డిండి : మండల పరిధిలోని గోనబోయనపల్లి, ప్రతాప్‌నగ్ గ్రామాల శివారులోని వ్యవసాయ పొలాలకు సాగు నీరందించడానికి ప్రత్యేక తూం, కావాల్సిన ఎస్టిమేషన్(అంచనా) వేయాలని ఇరిగేషన్ ఈఈ శ్రీధర్‌రావు సంబంధిత డీఈ శ్రీనువాసులు, ఏఈ ఫయాజ్‌కు సూచించారు. శుక్రవారం మండలంలోని ఏనకుంట వద్ద తూం ఏర్పాటును పరిశీలించినంతరం స్థానిక ఈఈ కార్యాలయంలో పనులకు సంబంధించిన సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం దేవరకొండ పట్టణంలో పట్టుకొని కేసు నమోదు చేశారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తాటికోల్ వాగు నుంచి నాలుగు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు .

## భాస్కర్‌నాయక్‌కు గిరిజన సంఘం నేతల సన్మానం



భాస్కర్‌నాయక్‌ను సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

హాలియా : ఆలిండియా బంజారా సేవా సంఘం సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన ధనావత్ భాస్కర్‌నాయక్‌ను గిరిజన సంఘాల నేతలు శుక్రవారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సపావట్ పాండు నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రతి గ్రామంలో భోగ్‌బండారు కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని, బంజారా భవనాన్ని త్వరగా పూర్తి చేయించాలని నూతన అధ్యక్షుడు భాస్కర్‌నాయక్‌ను కోరారు. ఎస్టీసెల్ అధ్యక్షుడు పాండునాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రమావత్ సర్దార్‌నాయక్, కౌన్సిలర్ ప్రసాద్‌నాయక్, ఎంపీటీసీ అనిల్‌నాయక్, నాయకులు తులస్యనాయక్, విజయ్, వాండోతు పాండునాయక్, నేనావత్ అశోక్‌నాయక్, మోతీలాల్, బాలు, దత్తునాయక్, మునినాయక్, రాంబాబు, సోమ్లా, శ్రీను తదితరులు ఉన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

దేవరకొండ : మండల పరిధిలో చేపడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రకాష్ అన్నారు. శుక్రవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఇప్పటికే పూర్తయిన వాటర్ ట్యాంక్, డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ పనులను ఆయన క్షణ్ణంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా చేపట్టే మంచినీటి పైప్‌లైన్ పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని ఆయన స్థానిక అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఈ లింగారెడ్డి, ఏఈ శంకర్, తదితరులు ఉన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయొద్దు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

హాలియా : ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే చెత్తను రోడ్డుకు ఇరువైపులా, లేదా ఖాళీ ప్రదేశాల్లో వేయకూడదని అనుముల మండల తహసీల్దార్ జయశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్మికులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూడిద స్వాతి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవూర : బాలికల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ చలకుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ గౌసియాబేగం అన్నారు. శుక్రవారం మండలంలోని చలకుర్తి-1 అంగన్‌వాడీ కేంద్రంలో స్వరక్షా డే సందర్భంగా బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించార న్నారు పోక్సో చట్టం, చైల్డ్ ప్రొటెక్షన్ పాలసీ, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నల్లగొండక్రైం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా అవసరమని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సైబర్ మోసాలు-అప్రమత్తత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లకు, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. టెక్నాలజీ ఉపయోగించుకుని నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మోసానికి గురైతే 1930, 155260, 8712665575, 8712665625 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో షీటీం ఎస్ఐ విజయలక్ష్మీ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వెన్షన్




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం నుంచి నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని దామరచర్ల ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బాలికలపై, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కన్వెన్షన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 300మంది హాజరవుతారని తెలిపారు. ఈ కన్వెన్షన్‌లో విద్యారంగా, బాలికల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్, విష్ణు, రాహుల్, నిఖిల్, అక్షయ్, అభిషేక్ పాల్గొన్నారు.

### ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

నల్లగొండ రూరల్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవవాణి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణపై నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు . గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రాజారాం, ఎన్ఎస్ఎస్ పీఓ సరిత, శైలజ, వనజ, స్వామి పాల్గొన్నారు.

## దరఖాస్తుదారుల వివరాలు పక్కాగా సేకరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న మిర్యాలగూడ ఆర్డీఓ

మాడుగులపల్లి : ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పక్కాగా సేకరించాలని మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య సూచించారు. మండలంలోని ఇందుగుల గ్రామంలో డేటా ఎంట్రీ సవరణ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకొని గ్యాస్ కనెక్షన్ నంబర్లు సక్రమంగా ఇవ్వని వారి వివరాలు నేరుగా సంప్రదించి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పారదర్శంగా పూర్తయ్యిందని, సరిగ్గా వివరాలు ఇవ్వని వారివి పునఃపరిశీలించి సేకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ జమీరొద్దీన్, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులున్నారు.